క్లుప్తంగా

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి



జగన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న హౌసింగ్ డీఈ రత్నాకర్

మెంటాడ: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈ రత్నాకర్ సూచించారు. మంగళవారం మండలంలోని తాటిపూడివలస గ్రామ జగన్న కాలనీ నిర్మాణాలను పరిశీలించిన తర్వాత ఆయన మండల కేంద్రంలోని హౌసింగ్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఈ ఏడాది ఉగాది నాటికి నిర్మాణాలు పూర్తి చేయించి, సామూహిక గృహ ప్రవేశాలకు లబ్ధిదారులు సిద్ధమయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఏఈ డేవిడ్ పాల్గొన్నారు.

టీటీడీ చైర్మన్‌కు ఘనసన్మానం



టీటీడీ చైర్మన్‌ను సత్కరిస్తున్న పాలవలస కుటుంబీకులు

రాజాం: టీటీడీ చైర్మన్, వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని పార్టీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ పాలవలస పద్మావతి మంగళవారం ఘనంగా సన్మానించారు. పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యేందుకు రాజాం విచ్చేసిన ఆయన శ్రీనివాసరావు ఇంటికి రాగా సదరు నేతలు దుశ్శాలువ, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, జెడ్పీ వైస్‌చైర్మన్ సిరిపురపు జగన్‌మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

నలుగురికి షోకాజ్ నోటీసులు!



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఆర్‌జేడీ జ్యోతికుమారి

రామభద్రపురం: మండలంలోని బూసాయవలస, రామభద్రపురం జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఆర్‌జేడీ జ్యోతికుమారి మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. బూసాయవలస స్కూల్‌లో విద్యార్థులతో సక్రమంగా వర్క్‌బుక్‌లు రాయించడం లేదని, లెస్సన్ ప్లాన్, ఇయర్ ప్లాన్, టీచర్ డైరీ రాయడంలో నిర్లక్ష్యంగా ఉన్న సిబ్బందిని గుర్తించిన ఆమె ప్రధానోపాధ్యాయుడు బి.ఎ.రాజు, ఉపాధ్యాయులు కె.సువర్ణ, పి.వి.వి.కె.కుమారి, జి.నాగరాజులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని డిప్యూటీ డీఈఓ తిరుపతి నాయుడును ఆమె ఆదేశించారు. మరోసారి జరిగే తనిఖీల్లో తప్పులు సరిదిద్దుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా చూడాలని సిబ్బందిని కోరారు. ఆమె వెంట ఎంఈఓ తిరుమలప్రసాద్ ఉన్నారు.

జగనన్న కాలనీకి విద్యుత్ వెలుగులు



విద్యుత్ కనెక్షన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: మండలంలోని బొద్దాం గ్రామ సోపేరు రోడ్డులోని జగనన్న కాలనీకి విద్యుత్ వెలుగులు వచ్చాయి. కాలనీలో కొత్తగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా ఇంటింటికీ ఇచ్చిన విద్యుత్ కనెక్షన్లు, వీధి దీపాలను ఎమ్మెల్యే కంబాల జోగులు మంగళవారం ప్రారంభించారు. దాదాపు రూ. 14 లక్షల నిధులతో మొత్తం 74 ఇళ్లకు ఈ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మండలంలోని అన్ని జగనన్న లే–అవుట్లకు ఎలక్ట్రికల్ ఏఈ సురేష్‌కుమార్ ఎంతో శ్రమించి సకాలంలో విద్యుత్ సరఫరాకు సంబంధించిన ఏర్పాట్లు చేయించారని ప్రశంసించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎల్.సులోచన, వైస్ ఎంపీపీ ఎస్.వర్షిణి, పార్టీ రాజాం కన్వీనర్ ఎల్.రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బి.నర్సింహులు, సర్పంచ్ ఎన్. తవిటమ్మ, ఎలక్ట్రికల్ ఏడీఈ బీవీఎస్ ఫణీంద్రకుమార్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

రేగిడి: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ, ప్రకృతి వ్యవసాయ ట్రైనీ మాస్టర్ సీహెచ్ శారద అన్నారు. మంగళవారం మండలంలోని ఉప్పరనాయుడువలస గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో రైతులు ఇంటికి అవసరమైన కూరగాయలు, పండ్లు, అరటికాయలను చక్కగా పండించు కోవచ్చన్నారు. తక్కువ శ్రమ, పెట్టుబడితో అధిక ఆదాయం వచ్చే పంటలు పండించుకోవచ్చన్నారు. అనంతరం జీవామృతం తయారీ విధానాన్ని ప్రయోగాత్మకంగా రైతులకు వివరించారు.

గృహసారథులే గెలుపు వారధులు

- అభివృద్ధి, సంక్షేమమే పార్టీ అజెండా
- ప్రతీ కార్యకర్తకు సీఎం అండగా ఉన్నారు..
- టార్గెట్–175లో రాజాం ముందుండాలి
- వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



సమావేశానికి హాజరైన కార్యకర్తలు

అర్హులందరికీ న్యాయం: ఎమ్మెల్యే జోగులు



వైఎస్సార్ సీపీ పాలనలో అర్హులందరికీ న్యాయం జరుగుతోంది. ఇప్పటివరకు అమలైన పథకాల్లో ఏ ఒక్క పథకం కూడా అనర్హుడికి ఇవ్వలేదు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోంది. గతంలో పథకాలు కావాలన్నా, అభివృద్ధి పనులు కావాలన్నా మండల కేంద్రంలోని అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి. కానీ ఇప్పుడు గ్రామాల్లో ఏర్పాటైన సచివాలయాలతో ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు వచ్చాయి. వచ్చే ఎన్నికల్లో గెలుపు కోసం ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి. ప్రభుత్వ హయాంలో వేసిన రోడ్లు, చేపట్టిన అభివృద్ధి పనులతో ప్రజల వద్దకు ధైర్యంగా వెళ్లి, ఓటు అడగవచ్చు. గ్రామంలోనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతున్నాయి.

పథకాలే పార్టీని గెలిపిస్తాయి: జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు



వైఎస్సార్ సీపీ ఓ పెద్ద కుటుంబమని, ఇందులోని ప్రతీ కార్యకర్తను వ్యక్తిగతంగా కలుస్తాం. రాజాం నియోజకవర్గానికి గతంలో వచ్చిన మెజార్టీ కన్నా ఈసారి అధికంగా వచ్చేలా కృషి చేస్తాం. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అమలు చేసిన పథకాలు, చేసిన అభివృద్ధి పనులే పార్టీని గెలిపిస్తాయి. పేదవాని సంక్షేమం చూడలేని టీడీపీ ప్రభుత్వంపై ఎన్నో కుట్రలు పన్నుతోందని, వాటిని తిప్పికొట్టాలి. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకంతో ఈ ప్రాంత సస్యశ్యామలానికి కృషి చేస్తున్నాం. అలాగే ఒక్క రాజాం నియోజకవర్గానికే 4,500 జగనన్న గృహాలు ఇచ్చాం. ఇదే ఈ ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందనే దానికి నిదర్శనం.

పారదర్శకంగా పథకాల అమలు: ఎంపీ బెల్లాన చంద్రశేఖర్



గతంలో టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీ సిఫార్సుల మేరకు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకే ప్రభుత్వ పథకాలు అందేవి. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక అర్హతే ప్రామాణికంగా పారదర్శకంగా పథకాల అమలు జరుగుతోంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తనదైన మార్క్ పాలనతో దేశాన్నే ఆకట్టుకుంటున్నారు. ప్రజా సమస్యల పరిష్కారం, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి ఆయన ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటీర్ల వ్యవస్థకు దేశ వ్యాప్తంగా మంచిపేరుంది. సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామాల వద్దకే పాలన వచ్చింది.

అధిక మెజార్టీతో రాజాం గెలుపు: ఎమ్మెల్సీ విక్రాంత్

రానున్న ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో రాజాం నియోజకవర్గ ఎమ్మెల్యేను గెలిపించాలి. గతంలో రెండు పర్యాయాలు వైఎస్సార్ సీపీ అభ్యర్థినే రాజాం గెలిపించింది. ప్రతికూల పరిస్థితుల్లో కూడా ఇక్కడి ఎమ్మెల్యే కంబాల జోగులు టీడీపీ కుట్రలకు భయపడలేదు. సీఎం జగనన్న టార్గెట్–175 లక్ష్యం రాజాం ఎమ్మెల్యే గెలుపుతోనే మొదలు.

ఎన్నికల యుద్ధానికి సిద్ధం: పార్టీ రాజాం నియోజకవర్గ పరిశీలకుడు పేరాడ తిలక్

2024 ఎన్నికల యుద్ధానికి అందరూ సిద్ధంగా ఉండాలి. ప్రజల బాగోగుల కోసం అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శక పాలనే పార్టీ అభ్యర్థులను గెలిపిస్తుంది. వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపే అందరి లక్ష్యం కావాలి. ఆ దిశగా అందరూ పయనించాలి.

వచ్చే ఎన్నికల్లో విజయం ఖాయం: జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహనరావు

వచ్చే ఎన్నికల్లో కూడా వైఎస్సార్ సీపీ విజయం ఖాయం. టీడీపీ, ఎల్లోమీడియా ఎన్ని కుతంత్రాలు చేసినా ప్రజలంతా సీఎం జగన్‌మోహన్ రెడ్డి వెంటే ఉన్నారు. ఆయన అందిస్తున్న పాలనతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారు. అదే సంతోషం మళ్లీ కావాలనుకుంటున్నారు.

రాజాం:

గృహసారథులే రేపటి విజయానికి వారధి కట్టే యోధులు అని వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని సూర్యదుర్గా కల్యాణ మండపంలో నిర్వహించిన పార్టీ రాజాం నియోజకవర్గ కార్యకర్తలతో సమీక్షించిన ఆయన ప్రభుత్వం అధికారంలోకి వచ్చి, నాలుగో ఏడాది వచ్చిందని, దేశంలో ఎక్కడా లేని విధంగా సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి, అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన కొనసాగిస్తున్నామన్నారు. విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేశామని, నాడు–నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలు, కళాశాలలకు కొత్తరూపు తీసుకువచ్చామన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థల ద్వారా అవినీతికి తావులేకుండా అర్హులకే సంక్షేమ పథకాలు అందించడం జరుగుతోందన్నారు. అన్ని వర్గాలకు అన్ని రంగాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రాధాన్యమిస్తున్నారన్నారు. కులానికో కార్పొరేషన్ పెట్టి, వారి అభివృద్ధికి దోహదపడుతున్నారన్నారు. మనం నెరవేర్చిన ఎన్నికల హామీలతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని, ధైర్యంగా ఓటు వేయమని ప్రజల వద్దకు వెళ్లి అడగవచ్చన్నారు. సమాంతర వ్యవస్థ కోసమే సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల నియామకం జరుగుతోందని, ఈ నెలాఖరులోగా గృహసారథుల గుర్తింపు పూరికావాలని సూచించారు. 2024 ఎన్నికల సమయానికి ప్రతీ ఇంటికి మనం చేరువ కావాలని, టార్గెట్–175 సాధన దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. అదే క్రమంలో రాజాం సీటును గెలిపించి, ముందువరుసలో ఉంచాలన్నారు. అనంతరం కార్యకర్తలతో మండలాల వారీగా రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా సమీక్షించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ కేవీ సూర్యనారాయణ, పార్టీ రాజాం నియోజకవర్గ కన్వీనర్లు పి.శ్రీనివాసరావు, ఎల్.రాజగోపాలనాయుడు, పి.లక్ష్మణరావు, యూత్ నాయకులు కె.సందీప్, జెడ్పీటీసీ బి.నర్సింహులు, పీఏసీఎస్ అధ్యక్షుడు వి.చిన్నంనాయుడు, వంగర ఎంపీపీ యు.సురేష్‌ముఖర్జీ, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల కన్వీనర్లు వి.జగన్‌మోహనరావు, కె. సుదర్శనరావు, జి.స్వామినాయుడు, వైస్ ఎంపీపీ టి.అచ్చెన్నాయుడు, డి. తిరుపతి, వై.వెంకటేష్, సచివాలయ మండల కన్వీనర్ ఎం.విజయలక్ష్మి, కార్పొరేషన్ డైరెక్టర్లు బి.లలితకుమారి, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు



ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. పట్టణంలోని 14వ వార్డులో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు స్థానికులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన ఇప్పటివరకు ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, చేసిన అభివృద్ధి పనులు వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పథకాలు అందిస్తున్నారన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క పథకం కావాలన్నా మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, అధికారులు, నేతల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్ని వర్గాల్లోని అర్హులకు న్యాయం జరిగేలా పాలన చేస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.వేణుగోపాలనాయుడు, కౌన్సిలర్ శ్రీలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శంబర పోలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే



ఎమ్మెల్యేకు జ్ఞాపిక బహూకరిస్తున్న ఆలయ ఈఓ తదితరులు

బొబ్బిలి: మక్కువ మండలంలోని శంబర గ్రామంలో జరుగుతున్న శంబర పోలమ్మ జాతరకు ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు మంగళవారం కుటుంబ సమేతంగా హాజరై, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ, సిబ్బంది ఎమ్మెల్యే జ్ఞాపిక బహూకరించి, సాదర స్వాగతం పలికారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణ, ఎంపీపీ ఎస్.లక్ష్మి, పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.వేణుగోపాలనాయుడు ఉన్నారు.

నేడు పెదచామలాపల్లిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

మెంటాడ: మండలంలోని పెదచామాలాపల్లి గ్రామంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ త్రివిక్రమ్ ఓ ప్రకటనలో మంగళవారం వెల్లడించారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర పాల్గొంటారని, మండల స్థాయి అధికారులంతా హాజరు కావాలని ఆయన కోరారు.

బొబ్బిలి: పట్టణంలోని 18వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం బుధవారం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం అధికారులు ఓ ప్రకటనలో మంగళవారం వెల్లడించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు పాల్గొంటారన్నారు.

రేగిడి: మండలంలోని లింగాలవలసలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించనున్నట్లు వైస్ ఎంపీపీలు అచ్చెన్నాయుడు, జగన్‌మోహనరావు మంగళవారం తెలిపారు.

రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీల్లో సిరిపురం విద్యార్థుల సత్తా

సంతకవిటి: రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీల్లో మండలంలోని సిరిపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకు శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని కోడిరామ్మూర్తినాయుడు స్టేడియంలో ఈ పోటీలు జరగగా విద్యార్థిని ఆర్.స్వాతి అండర్–14 విభాగంలో 100 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం, 200 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం, 400 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు పీడీ సన్నిబాబు తెలిపారు. మరో విద్యార్థిని బి.సోనియ 600 మీటర్ల పరుగుపందెంలో తృతీయ స్థానం, పి.శ్రీలత అండర్–17 విభాగంలో 800 మీటర్ల విభాగంలో ద్వితీయ స్థానం, వి.రాజశేఖర్ అండర్–19 విభాగంలో 400 మీటర్ల విభాగంలో ద్వితీయ స్థానం, బి.వెంకటలక్ష్మి 3 కిలోమీటర్ల విభాగంలో ద్వితీయ స్థానం, ఎం.బాలాంజలి 400 రిలే విభాగంలో ద్వితీయ స్థానం సాధించారని పేర్కొన్నారు.

భూముల రీసర్వేతో వందేళ్ల నాటి సమస్యలు పరిష్కారం

- ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ బి.సుదర్శనదొర



మాట్లాడుతున్న ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ సుదర్శనదొర

రామభద్రపురం: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న భూముల రీసర్వేతో వందేళ్ల నాటి భూ సమస్యలు పరిష్కారమవుతున్నాయని ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ బి.సుదర్శనదొర అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం మీడియాతో మాట్లాడిన ఆయన మండలంలోని 18 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేశామని తెలిపారు. 3,683 శాశ్వత భూ హక్కు పత్రాలు పంపిణీ చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు 2,273 పత్రాలు పంపిణీ చేశామన్నారు. మిగిలినవి సాంకేతిక లోపం వల్ల చిన్నచిన్న తప్పులుండడం వల్ల పంపిణీ చేయలేదని, వీలైనంత త్వరగా వాటిని సరిచేసి అందజేస్తామన్నారు. పక్కాగా రూపొందించిన భూ హక్కు పత్రాలు రైతులకు ఇవ్వడం జరుగుతోందన్నారు. మండలంలోని రామభద్రపురం, ఆరికతోట, కోటశిర్లాం గ్రామాల్లో రీసర్వేలో భాగంగా నిర్వహిస్తున్న గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియ చాలా చురుగ్గా కొనసాగుతోందన్నారు. ఒక కమతా వద్ద గ్రౌండ్ ట్రూతింగ్ నిర్వహించేటప్పుడు ఆ కమతాకు సంబంధించిన రైతుతో పాటు చుట్టుపక్కలా ఉన్న రైతులతో మాట్లాడి సమస్యలు లేకుండా చూడాలన్నారు. స్వమిత్ర కార్యక్రమం కింద గ్రామ కంఠాల సర్వే తొలిసారిగా ప్రభుత్వం చేపడుతోందన్నారు. భూమి విలువ పెరిగిన నేపథ్యంలో భూ వివాదాలు వస్తున్నాయని, రీసర్వేతో వివాదాలకు చెక్ పడుతోందన్నారు. సర్వే అధికారులకు రైతులు కూడా సహకరిస్తూ భూ సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి. గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

బాడంగి: విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ కె.అక్కారావు హెచ్చరించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం సమావేశమైన ఆయన సమయానికి విధులకు హాజరు కావాలని, చెత్త సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై దృష్టి సారించాలని తెలిపారు. వలంటీర్లతో లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం



మెంటాడ: ర్యాలీలో విద్యార్థినులు, ఉపాధ్యాయులు



బొబ్బిలి: ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

రేగిడి: మండలంలోని దేవుదల గ్రామంలో ఉన్న కేజీబీవీలో జాతీయ బాలికా దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. అన్ని రంగాల్లో రాణించేలా ఆడపిల్లలను ప్రోత్సహించాలని ప్రిన్సిపాల్ రోహిణి కోరారు.

తెర్లాం: మండలంలోని కుమ్మరిపేట కేజీబీవీలో జాతీయ బాలికా దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, ఎంఈఓ జె.త్రినాథరావు బాలికల విద్య, ఆరోగ్యంపై పలు సూచనలు చేశారు. బాలికలంతా ఉన్నత చదువులు చదివి, మంచి స్థాయిలో స్థిరపడాలని ఆకాంక్షించారు.

బొబ్బిలి రూరల్: మండలంలోని అలజంగి, నారాయణప్పవలస, పెంట గ్రామాల్లో జాతీయ బాలికా దినోత్సవం మంగళవారం నిర్వహించారు. బాలికల విద్యాభివృద్ధికి తల్లిదండ్రులు కృషి చేయాలని వక్తలు సూచించారు.

బాడంగి: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో జాతీయ బాలికా దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ కృష్ణమూర్తి మాట్లాడుతూ బాలికలను బాలురతో సమానంగా చూడాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

మెంటాడ: జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఆడపిల్లలపై వివక్ష చూపవద్దని, మగపిల్లలతో సమానంగా ఆడపిల్లలను చూడాలని విద్యార్థినులు నినాదాలు చేశారు.

బొబ్బిలి: మండలంలోని పలు పాఠశాలల్లో జాతీయ బాలికా దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు బాలికా విద్య ప్రాధాన్యం, ఆడపిల్లల పెంపకంపై అవగాహన కల్పించారు.

సంక్షిప్తంగా...

ఫిజియోథెరపీతో మెరుగైన ఆరోగ్యం

బాడంగి: స్థానిక నాన్ భవిత కేంద్రంలో దివ్యాంగులైన చిన్నారులకు ఫిజియోథెరపిస్ట్ డి.యామిని మంగళవారం ఫిజియోథెరపీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ఫిజియో థెరపీ ద్వారా మెరుగైన ఆరోగ్యం లభిస్తుందన్నారు. నడవలేని స్థితిలో ఉన్న వంగపండు సంపత్‌కు మూడేళ్లుగా ఫిజియోథెరపీ చేస్తే ఇప్పుడు నడిచే స్థితికి వచ్చాడని ఉదహరించారు. ఇంటి దగ్గర కూడా పిల్లలకు క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ చేస్తే ఉత్తమ ఫలితాలు వస్తాయన్నారు.

రేగిడి: స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో ఫిజియోథెరపీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగులైన పలువురు చిన్నారులకు ఫిజియోథెరపిస్ట్ లక్ష్మీప్రసన్న ఫిజియోథెరపీ చేశారు.

రూ.3.96 లక్షల నగదు స్వాధీనం

బొబ్బిలి రూరల్: పట్టణంలోని అంట్యాకుల వీధిలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని మంగళవారం రాత్రి పట్టుకుని, అరెస్ట్ చేసినట్లు సీఐ ఎం.నాగేశ్వరరావు తెలిపారు. జూదరుల నుంచి రూ.3,96,140 నగదును స్వాధీనం చేసుకున్నామని ఆయన వెల్లడించారు.

పుస్తకాల వితరణ

తెర్లాం: స్థానిక శాఖా గ్రంథాలయానికి పెరుమాళి హైస్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న తెర్లాం ప్రాంతానికి చెందిన పాండ్రంకి శ్రీనివాసరావు మంగళవారం పుస్తకాలు వితరణ చేశారు. ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ గ్రూపులకు సంబంధించిన పుస్తకాలతో పాటు నీట్, జేఈఈ మెయిన్స్, ఇతర పోటీ పరీక్షలకు ఉపయోగపడే మరికొన్ని పుస్తకాలను దాత అందజేసినట్లు లైబ్రేరియన్ కృష్ణమూర్తి తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

రామభద్రపురం: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బొబ్బిలి కొప్పలవెలమ సంక్షేమ సంఘం రూపొందించి, ముద్రించిన క్యాలెండర్‌ను ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యమిస్తున్నారన్నారు. అర్హులైన ప్రతీ ఇంటి తలుపు తట్టి, సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ఆయనకే చెల్లిందన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డబ్ల్యూఎస్ రాయలు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై దృష్టిసారించాలి

తెర్లాం: అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంలో భాగంగా మండలంలోని అరసబలగ గ్రామంలో చిరుధాన్యాల సాగుపై రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చిరుధాన్యాల సాగు ద్వారా అధిక లాభాలు వస్తాయని, రైతులంతా వాటి సాగుపై దృష్టి సారించాలని మండల వ్యవసాయాధికారి జి.సునీల్‌కుమార్, విజయనగరం రైతు శిక్షణా కేంద్రం ఏడీ గోవిందమ్మ కోరారు. మార్కెట్‌లో చిరుధాన్యాలు అయిన రాగి, జొన్న, సజ్జలకు మంచి గిరాకీ ఉందన్నారు. సమావేశంలో సర్పంచ్ కె.సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

సంతకవిటి: మాఘమాస తొలి మంగళవారం కావడంతో మండలంలోని మందరాడ గ్రామ అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సింధూర అభిషేకాలు కూడా చేసినట్లు ఆలయ అర్చకులు దేవళ్ల మణిభూషణరావు తెలిపారు.

మెనూ తప్పనిసరి

రేగిడి: మండలంలోని ఆమదాలవలస, రేగిడి, వెంకంపేట, ఉంగరాడ గ్రామ పాఠశాలల్లో అమలుచేస్తున్న జగనన్న గోరుముద్ద పథకాన్ని ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు మంగళవారం పరిశీలించారు. విద్యార్థుల మెరుగైన ఆరోగ్యం దృష్ట్యా ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకం కింద అందజేస్తున్న మధ్యాహ్నం భోజనం వంటకాల్లో మెనూ తప్పనిసరిగా పాటించాలని ఎంఈఓ సూచించారు.

రాజాం: మండలంలోని గురవాం కేజీబీవీలో జగనన్న గోరుముద్ద పథకం కింద విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంను ఎంఈఓ పాండ్రంకి నాగయ్య మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వంటకాలు రుచి, శుచిలతో ఉండేలా చూడాలని సిబ్బందికి సూచించారు.

ఆర్థికసాయం

బొబ్బిలి: పాతబొబ్బిలి వద్ద అభయాంజనేయ విగ్రహ నిర్మాణానికి మాజీ సైనికోద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడు మరడ అప్పారావు మంగళవారం రూ.10 వేలు వితరణ చేశారు. కార్యక్రమంలో యువ సంకల్ప అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పందెంరాయుళ్ల అరెస్ట్

మెంటాడ: మండలంలోని పోరాం గ్రామంలో కోడి పందాలు నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, అరెస్ట్ చేసినట్లు ఆంధ్ర ఎస్ఐ సిద్ధార్థ మంగళవారం తెలిపారు. నిందితుల నుంచి రూ.1240 నగదుతో పాటు నాలుగు కోడిపుంజులు స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే గుర్ల గ్రామంలో ద్విచక్ర వాహనంపై సారా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకుని, వారి నుంచి 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

బొబ్బిలి రూరల్: యువత, విద్యార్థులంతా మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఆర్.జైభీమ్ సూచించారు. స్థానిక పట్టణంలో మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై మంగళవారం అవగాహన కల్పిస్తూ హోర్డింగులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాదక ద్రవ్యాలకు బానిసలైన ఎంతోమంది జీవితాలు నాశమయ్యామని, వాటిని వాడినా, కొనుగోలు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఎంపీడీఓ సందర్శన

రేగిడి: మండలంలోని అంబాడ, చిన్నశిర్లాం గ్రామ సచివాలయాలను ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాథరావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడి పలు రికార్డులు పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. సమయానికి విధులకు హాజరై, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. అర్హులకే సంక్షేమ పథకాలు అందేలా పనిచేయాలన్నారు.

కేజీబీవీలో తనిఖీలు

తెర్లాం: మండలంలోని కుమ్మరిపేట కేజీబీవీలో ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, ఎంఈఓ త్రినాథరావు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తొలుత అక్కడి ఇంటర్మీడియట్ విద్యార్థుల విద్యాసామర్థ్యాలను పలు ప్రశ్నల ద్వారా గమనించిన అధికారులు అనంతరం మెనూ ప్రకారం విద్యార్థులకు పెడుతున్న భోజనాలపై ఎస్ఓను ఆరాతీశారు. తర్వాత స్టాక్ రూమ్‌కు వెళ్లి, సరుకుల నిల్వలను పరిశీలించారు. విద్యార్థుల చదువుతో పాటు వారి ఆరోగ్యంపై కూడా ప్రత్యేక దృష్టిసారించాలని కోరారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలన్నారు.

రుణాల రెన్యువల్ చేసుకోండి

సంతకవిటి: స్థానిక కో–ఆపరేటివ్ సొసైటీలో తీసుకున్న పంట రుణాలను రెన్యువల్ చేసుకోవాలని చైర్మన్ ఎస్‌పీ రమణారావు సూచించారు. మండల కేంద్రంలోని కో–ఆపరేటివ్ బ్యాంకు వద్ద సీఈఓ కె.రమణతో కలిసి మీడియాతో మాట్లాడిన ఆయన ఫిబ్రవరి నెలాఖరులోగా 4 శాతం వడ్డీ చెల్లించి, రుణాలను రెన్యువల్ చేసుకోవాలన్నారు. రెన్యువల్ చేయకపోతే 13 శాతం వడ్డీతో పాటు అసలు కూడా కట్టాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. రెన్యువల్‌కు ఆధార్, 1–బి, మొబైల్ నంబర్‌తో సొసైటీని సంప్రదించాలన్నారు.

సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధం కావాలి

రాజాం సిటీ: సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధం కావాలని మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు కోరారు. మంగళవారం మండలంలోని కంచరాం వద్ద ఉన్న జగనన్న కాలనీ లే–అవుట్‌ను పరిశీలించిన ఆయన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని లబ్ధిదారులకు సూచించారు. ఇంకా నిర్మాణాలు ప్రారంభించని వారు త్వరితగతిన పనులు చేపట్టి, ఉగాది నాటికి గృహ ప్రవేశాలు చేయాలన్నారు.

పక్కాగా భూముల రీసర్వే

బొబ్బిలి రూరల్: పక్కాగా భూముల రీసర్వే చేపట్టాలని ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ బి.సుదర్శన దొర సూచించారు. మండలంలోని రాముడువలస గ్రామంలో జరుగుతున్న భూముల రీసర్వేను మంగళవారం పరిశీలించిన ఆయన రైతుల సమస్యలు పరిష్కారమయ్యేలా సర్వే చేయాలన్నారు. సర్వే జరిగే సమయంలో రైతులు ఉండేలా చూసుకోవాలన్నారు. భూమి కొలతల తేడాలపై రైతులు సంప్రదించినప్పుడు వారి పట్ల మర్యాదగా ప్రవర్తించి, సమస్య పరిష్కారం చేయాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బొబ్బిలి రూరల్: పారాలీగల్ వలంటీర్లుగా పని చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ చైర్మన్ టి.వాసుదేవన్ తెలిపారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడిన ఆయన పదో తరగతి పాసైన వారంతా ఈ నెల 31వ తేదీలోగా కోర్టు ఆవరణలోని మండల న్యాయసేవా కమిటీని సంప్రదించాలని కోరారు.